జోరుగా ఎన్నికల ఏర్పాట్లు

- ఏర్పాట్లలో తలమునకలైన అధికార యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


మడకశిర తహసీల్దార్ కార్యాలయం

మడకశిర: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈనెల చివరి వారంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం జోరుగా చేస్తోంది. ఈ నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగానే పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మడకశిర నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఎన్నికల విభాగం అధికారులు కూడా ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

అమరాపురంలో మొదటి పోలింగ్ కేంద్రం

నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. మొత్తం 5 మండలాల పరిధిలో 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అమరాపురం మండలంలో 52, గుడిబండలో 47, రొళ్లలో 32, అగళిలో 29, మడకశిర రూరల్‌లో 59, మడకశిర అర్బన్‌లో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా మడకశిర రూరల్ మండలంలో 59, అత్యల్పంగా మడకశిర అర్బన్‌లో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మడకశిర మున్సిపాలిటీ పరిధిలో 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1 నుంచి 52 వరకు అమరాపురం మండలం, 53 నుంచి 99 వరకు గుడిబండ మండలం, 100 నుండి 131 వరకు రొళ్ల మండలం, 132 నుంచి 160 వరకు అగళి మండలం, 161 నుంచి 181 వరకు, 200 నుంచి 230 వరకు మడకశిర రూరల్ మండలం, 182 నుంచి 199 వరకు మడకశిర అర్బన్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను వరుస సంఖ్య ప్రకారం ఏర్పాటు చేశారు. 1వ పోలింగ్ కేంద్రం అమరాపురం మండలంలో ప్రారంభమవుతుంది. చివరి 237వ పోలింగ్ కేంద్రం మడకశిర రూరల్ మండలంలో ఉంటుంది.

తగ్గిన పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో గతంలో కంటే ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలు తగ్గాయి. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 263 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత ఎన్నికలకు 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 26 పోలింగ్ కేంద్రాలు తగ్గాయి. ఈసీ ఆదేశాల మేరకు 1500 ఓట్లకు చొప్పున ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఆ ప్రకారం అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పురుష ఓటర్లు అధికం

నియోజకవర్గంలో పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,11,074 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,06,242 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 1,04,831 మంది ఉన్నారు. 1,411 మంది పురుష ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. అమరాపురం మండలంలో అత్యధికంగా 46,919 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా మడకశిర అర్బన్‌లో 17,204 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రాలు
అమరాపురం	52
గుడిబండ	47
రొళ్ళ	32
అగళి	29
మడకశిర రూరల్	59
మడకశిర అర్బన్	18
మొత్తం	237

పకడ్బందీగా ఏర్పాట్లు



నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నాం. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేశాం. ఓటరు తుది జాబితాను కూడా ప్రకటించాం. ఈనెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే కోడ్ అమలుల్లోకి వస్తుంది. ఎన్నికల కోడ్‌ను కూడా పగడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటాం. రాజకీయ పార్టీలు ఎన్నికల సజావుగా నిర్వహించడానికి సహకరించాలి.

– మారుతీప్రసాద్,
డీటీ, ఎన్నికల విభాగం, మడకశిర

క్లుప్తంగా

చింత, చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని మోరబాగల్, కొంకల్లు గ్రామ పంచాయతీకి చెందిన చింత ఫలసాయం, చేపల చెరువుకు బుధవారం వేలం పాటు నిర్వహించారు. చేపల చెరువుకు రూ.13,61,000కు బుల్లేష్నన్న , కొంకల్లు చింత తోపును రూ.25 వేలకు వెంకటరమణప్ప వేలం పాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా రంగస్వామి


బాధ్యతలు స్వీకరిస్తున్న రంగస్వామి

మడకశిర: మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా రంగస్వామి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

నేడు వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

మడకశిర: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపైన ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ హిందూపురం, మడకశిర సమన్వయకర్తలు శాంతమ్మ, ఈర లక్కప్ప హాజరవుతారని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న ఉపాధ్యాయులు

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బృందం రూ. 40 వేలు విరాళం అందజేసింది. సర్పంచ్ పరమేష్, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాసులు, రంగారెడ్డి తదితరులకు బుధవారం ఆ మొత్తాన్ని అందజేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్‌రావు

మడకశిర: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్‌రావు సూచించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని, త్వరలో ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడుతుందని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల విభాగం డీటీ మారుతీప్రసాద్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టీడీపీ నేతల వాహనాల సీజ్

చిలమత్తూరు: మండల కేంద్రం సమీపంలోని బైరేకుంట చెరువులో మట్టి అక్రమ రవాణా చేస్తున్న టీడీపీ నాయకులకు సంబంధించిన జేసీబీ, రెండు ట్రాక్టర్లను చిలమత్తూరు పోలీసులు సీజ్ చేశారు. టీడీపీ నాయకులు ప్రసన్నకు చెందిన జేసీబీ ద్వారా మంగళవారం రాత్రి అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తుండగా వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తహసీల్దార్ భాగ్యలత వాహన యజమానికి జరిమానా విధించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున మట్టి దందా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

గుడిబండ: మండల పరిధిలోని వివిధ సచివాలయాలను బుధవారం ఎంపీడీఓ బంగారమ్మ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

అమరాపురం: పేదలందరికీ ఇళ్లు పథకం కింద మండలంలో పట్టాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం మండలంలోని బసవనపల్లి, వలస, కె.శివరం, తమ్మడేపల్లి గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులు తమ ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హిందూపురం అర్బన్: పట్టణ సమీపంలోని కొట్నూరు కట్టపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలం చోళేమర్రికి చెందిన మారుతి (19) మృతి చెందాడు. అతని మిత్రుడు మంజునాథ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. చోళేమర్రి నుంచి హిందూపురానికి మారుతీ తన మిత్రుడు మంజునాథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. అలాగే హిందూపురం వైపు నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న లారీ కొట్నూరు కట్టపై ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో భాష్యం పాఠశాలలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, ఏపీఎస్ఎఫ్ నాయకులు నాగభూషణం డీబీ కాలనీలోని భాష్యం పాఠశాలను పరిశీలించారు. భాష్యం పాఠశాల సిబ్బంది ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తోందని, దీనిపై విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ భాష్యం పాఠశాలను పరిశీలించి, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: మండలంలోని హరేసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో సత్తాచాటారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. బుధవారం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టుకు ఎంపీడీఓ కార్యాలయంలో క్రికెట్ సామగ్రిని మండల పరిషత్ అధికారులు అందించి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని అధికారులు, పీఈటీలు ఆకాంక్షించారు. అలాగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నందిని, పూర్ణిమ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారుణులకు షీల్డ్, నగదు బహుమతులను అందజేశారు.

పరిగి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా ఇటీవల జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు. ఇందులో భాగంగానే ఈనెల 9న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఎస్ఓ సువర్ణమ్మ తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

లేపాక్షి: మండల వ్యాప్తంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ వెంకటరత్నమ్మ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,359 ఇళ్లు మంజూరు కాగా అందులో 498 ఇళ్ల మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు నత్తనడక జరుగుతున్నాయని, వాటిని వేగవంతం చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారి శ్రీలత మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ లోపు రైతులందరూ పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాల కోసం ఆర్‌బీకే కేంద్రాల్లో రిజిస్టరు చేసుకోవాలన్నారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పంట నష్ట పరిహారం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. పశుబీమా పథకాన్ని పశువులు, మేకలు, గొర్రెలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి కిషోర్ తెలిపారు. బీసీఎల్ కింద ఉన్న రైతులు 20 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలో రైతులకు, ఇళ్లకు లోఓల్టేజీ లేకుండా చర్యలు తీసుకున్నామని, కల్లూరులో రూ. 3 కోట్లతో సబ్ స్టేషన్ కూడా ఏర్పాటు చేసినట్లు ఏఈ వెంకటేశలు తెలిపారు. అయితే మండల సమావేశానికి చాలా మంది మండలాధికారులు గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, సీడీపీఓ రెడ్డిరమణమ్మ తదితరులున్నారు.

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. బుధవారం మున్సిపాల్టీ పరిధిలోని 29వ వార్డులోని ముక్కిడిపేట, 2వ వార్డు సచివాలయ పరిధిలో కౌన్సిలర్ రోషన్ అలీతో కలసి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ లబ్ధి వివరాలను తెలియజేశారు.

ఎమ్మెల్యే బాలకృష్ణకు అభివృద్ధి పట్టదా?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హిందూపురంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రతి వార్డులో డ్రైనేజీ, రోడ్లు అధ్వాన్నంగా మారాయని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక విమర్శించారు. గత పాలకులు జేబులు నింపుకోవడానికి కృషి చేశారే తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తన బాధ్యతను సక్రమంగా నిర్వహించి అసెంబ్లీలో గళం విప్పివుంటే పురం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. ఎమ్మెల్యే బాధ్యత మరిచినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి కృషి చేస్తూ వస్తోందన్నారు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఏనాడు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు తప్ప ఆయనకు పురం ప్రజలు గుర్తుకురారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫరూక్, పట్టణ మైనార్టీ కన్వీనర్లు అయూబ్, షాజహాన్, మహిళా విభాగం కన్వీనర్ భాను, నాయకులు ఇలియాజ్, భారతి, మస్తాన్, ఇమ్రాన్, ఫరూఖ్, గఫార్, రఘురాం, ఆయూబ్ , రిజ్వాన్, బషీర్, ఆసిఫ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు అజయ్‌కుమార్

పావగడ: మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడలోని కోటె ఆంజనేయస్వామి ఆలయం వీధిలో నివాసముంటున్న బోయ వెంకటస్వామి కుమారుడు అజయ్‌కుమార్ (23) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. దీంతో మానసికంగా కుదేలైన అజయ్‌కుమార్ ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఉండసాగాడు. దీనికి తోడు నిద్రలేమి కారణంగా మానసిక రుగ్మతకు లోనయ్యాడు. మంగళవారం రాత్రి తండ్రి, చెల్లెలు ఇంటి బయట, అజయ్‌కుమార్ ఇంట్లో లోపల నిద్రపోయారు. బుధవారం ఉదయం కుమారుడు ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో కుటుంబసభ్యులు బలవంతంగా తలుపులు తీసి లోపలకు ప్రవేశించారు. అప్పటికే పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మృతుడిని కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గురునాథ్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జిల్లా అర్చక ప్రముఖ్‌గా శ్రీనిధి భట్టార్



అమరాపురం: జిల్లా అర్చక ప్రముఖ్‌గా అమరాపురం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు ఎన్నికయ్యారు. బుధవారం కదిరిలో జరిగిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో కేంద్రీయ సహాయ కార్యదర్శి నాగరాజు చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నట్లు చెప్పారు.

నులి పురుగులను నులిపేద్దాం

పరిగి: చిన్న పిల్లలు, విద్యార్థుల్లో నులి పురుగుల నివారణే ధ్యేయంగా ఈనెల 9న విద్యార్థులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వరూపరెడ్డి తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో బుధవారం నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు.

రొళ్ల: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్ఎన్ సుధారాణి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, అంగనవాడీ వర్కర్లకు ఆల్‌బెండజోల్ మాత్రలను అందజేశారు.

కంప్యూటర్ సెంటర్ దగ్ధం

రొద్దం: బతుకు తెరువు కోసం ఏర్పాటు చేసుకున్న కంప్యూటర్ సెంటర్ మంటల్లో దగ్ధమైంది. రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు... రొద్దంలోని బ్యాంక్ సర్కిల్ వద్ద గ్రామ వలంటీర్ నిరంజన్‌కుమార్ ఓ కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి రూ.50 వేలు విలువ చేసే కంప్యూటర్, రూ.50 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్, రూ.1లక్ష విలువ చేసే ఫైబర్ నెట్ పరికరాలతో పాటు మరో రూ.2 లక్షల విలువైన సామగ్రి కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం ఉదయం కంప్యూటర్ సెంటర్‌ను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవి శేఖరరెడ్డి, పలువురు వలంటీర్లు అక్కడకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పెనుకొండ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. నగర పంచాయితీ పరిధిలోని మంగాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వారం రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నారు. బుధవారంతో ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగియడంతో గ్రామంలోని రహదారుల వెంబండి మొక్కలు నాటారు.

పన్ను వసూలు చేయండి


రికార్డులు తనిఖీ చేస్తున్న రమ

పెనుకొండ: గ్రంథాలయ పన్ను సక్రమంగా వసూలు చేయాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


కొండాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

గోరంట్ల: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా పరిశీలించారు. కొండాపురం, పులేరు, బూదిలి, బూడిదగడ్డపల్లి, గుమ్మయ్యగారిపల్లి, గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ సుబ్బరాయుడుతో పాటు సిబ్బందికి సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరించండి

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ (మెట్ట ప్రాంతాల్లో) పండ్ల మొక్కలు పెంపకానికి ఆసక్తి చూపుతున్న సన్న, చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి పథకం సాంకేతిక, క్షేత్ర సహాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి 30 మంది సన్న, చిన్నకారు రైతులకు తక్కువ కాకుండా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు తీసుకొనే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయల సమావేశపు భవనంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఏపీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


పూజలో పాల్గొన్న విద్యార్థులు


అలంకరణలో సరస్వతీదేవి

అగళి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకం, పూజలు చేశారు. సరస్వతీ మంత్రాన్ని విద్యార్థులతో పఠించారు. అనంతరం ప్రిన్సిపాల్ మహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ.. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చదువుకోవాలన్నారు. పాఠ్యాంశాలను రివిజన్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలంటే భయం అవసరం లేదని, బాగా చదివితే మంచి మార్కులు వస్తాయని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు క్విజ్ పోటీలు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఆర్టీటీ కార్యాలయంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన 5వ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు యూనియన్ బ్యాంకు మేనేజర్ గోపీ చేతులు మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

రొద్దం: మండల పరిధిలోని కలిపి సచివాయ పరిధిలోని క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్ర'లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. దీంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు క్రీడాకారులకు బుధవారం రూ.17 వేలు ఆర్థికసాయం, క్రీడా దుస్తులు అందించి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, సర్పంచ్ శివ, ఎంపీటీసీ నారేంద్ర, అల్లాబాకాష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మడకశిర: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని హిందూపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ కోరారు. పట్టణంలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.వాహన రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.